- ధర్మపోరాట సభకు అనుమతి ఇవ్వలేదంటూ ఏర్పాట్లను అడ్డుకున్న పోలీసులు
- తిరగబడిన బీసీవైపీ శ్రేణులు, పలువురి అరెస్టు
- సొమ్మసిల్లిన కార్యకర్తలు
- పోలీసుల వైఖరిపై రామచంద్రయాదవ్ ఆగ్రహం



చదళ్లలో టెన్షన్.. టెన్షన్

పుంగనూరు, జనవరి 12: మళ్లీ అదే సీన్ రిపీటైంది. పుంగనూరు నియోజకవర్గంలో వైసీపీ తప్ప ఎవరు సభ పెట్టినా అడ్డుకోవడం పోలీసుల పనిగా మారింది. అదే క్రమంలో బీసీవైపీ శనివారం నిర్వహించదలచిన ధర్మపోరాట సభకు అనుమతి ఇవ్వలేదు. ప్రైవేటు స్థలంలో జరుగుతున్న ఏర్పాట్లను పోలీసులు అడ్డుకోవడంతో శుక్రవారం చదళ్ల వద్ద ఉద్రిక్తత నెలకొంది. పుంగనూరు- చౌడేపల్లె మార్గంలోని చదళ్ల వద్ద ప్రైవేటు స్థలంలో ధర్మపోరాట సభ నిర్వహించాలని భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ భావించారు. దీనికోసం వారం రోజుల కిందట పలమనేరు డీఎస్పీ, పుంగనూరు పోలీసులను అనుమతి కోరారు. పోలీసుల సూచనలతో మీటింగ్, మైక్ అనుమతికి చలానా కట్టగా.. అనుమతి ఇస్తామని పోలీసులు చెప్పారని బీసీవైపీ శ్రేణులు అంటున్నారు. సభా ఏర్పాట్లు చేపట్టారు. ఈ సభకు అనుమతిలేదంటూ శుక్రవారం ఉదయం పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. ఈ విషయం తెలిసి రామచంద్రయాదవ్ అక్కడికి చేరుకుని పోలీసులను ప్రశ్నించారు. 'సింగిల్ రోడ్డు కావడంతో ట్రాఫిక్ సమస్య వస్తుంది. పార్కింగ్ ఎక్కడా చెప్పలేదు. సభకు ఎంత మంది వస్తారు? వచ్చే వారి ఆధార్ కార్డుల వివరాలు ముందుగా ఇవ్వలేదు. అందుకని డీఎస్పీ సుధాకర్‌రెడ్డి అనుమతి నిరాకరించారు' అంటూ పుంగనూరు, చౌడేపల్లె సీఐలు రాఘవరెడ్డి, ఎం.కృష్ణారెడ్డి చెప్పారు. 'ప్రైవేటు స్థలంలో మీటింగు జరిగితే మీకు వచ్చే ఇబ్బంది ఏమిటి? ఎక్కడైనా మీటింగ్‌కు వచ్చే వారి ఆధార్‌కార్డులు ముందుగా ఇస్తారా? ఇదెక్కడి పద్ధతి? ఎవరికీ ఇబ్బంది లేకుండా సభ పెట్టుకుంటాం' అని రామచంద్రయాదవ్ చెప్పినా పోలీసులు అంగీకరించలేదు. పనులు చేస్తున్న కూలీలను అడ్డుకున్నారు. తాగునీరు తెచ్చిన ఆటో, కుర్చీలు, ఇతర సామగ్రి ఉన్న వాహనాలను వెనక్కి పంపేశారు. కేసులు పెడతామంటూ అక్కడ పనిచేసే వారిని హెచ్చరించారు. పోలీసులను బీసీవైపీ శ్రేణులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. అయినా, అందరూ అక్కడే ఉన్నారు.


ఏర్పాట్లను ఎలా అడ్డుకుంటారంటూ చౌడేపల్లె సీఐతో రామచంద్రయాదవ్ వాగ్వాదం

కార్యకర్తను చెప్పుతో కొట్టిన సీఐ

సాయంత్రానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా బలగాలు, మహిళా పోలీసులు సభాస్థలానికి చేరుకున్నారు. శాంతిభద్రతల సమస్య వస్తుందని, అందరూ వెళ్లాలని సూచించారు. కొందరు గట్టిగా నిలబడటంతో ఆగ్రహంతో లాక్కెళ్లారు. తోపులాటలో పడిఉన్న చెప్పుతో ఓ కార్యకర్తను గంగవరం సీఐ కృష్ణమోహన్ కొట్టడంతో.. పోలీసుల వైఖరిపై ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. సీఐ చెప్పుతో కొట్టిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. రామచంద్రయాదవ్‌ను ముందస్తు అరెస్టు చేయాలని రాగా సీఆర్పీఎఫ్ సిబ్బంది అడ్డుకోగా పుంగనూరు సీఐ రాఘవరెడ్డి వాగ్వాదానికి దిగారు. యాదవ్‌కు అడ్డుగా ఉన్న పార్టీ శ్రేణులను పోలీసులు లాగేశారు. చివరకు ఆయన్ను కారులోకి తీసుకెళ్లారు. ఆ కారును ముందుకు తీసుకెళ్లకుండా.. నాయకులు, కార్యకర్తలు అడ్డంగా పట్టుకున్నారు. మంత్రి పెద్దిరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు కార్యకర్తలను ఈడ్చుకుంటూ, బూటు కాళ్లతో తోస్తూ, చేతులతో లాగుతూ కింద పడిపోయినా వదలకుండా లాక్కెళ్లి వాహనాల్లో ఎక్కించారు. దాదాపు 50 మందిని వివిధ పోలీసు స్టేషన్లకు తీసుకెళ్లారు. ఈ తోపులాటల్లో పలువురు సొమ్మసిల్లి అపస్మారకస్థితిలోకి వెళ్లారు.

ఎప్పుడు సభ పెట్టినా ఇంతేనా?

పుంగనూరులో ఏకార్యక్రమం పెట్టినా ఎందుకు అడ్డుకుంటారంటూ సీఐలు రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, సదుం ఎస్ఐ మారుతిపై మహిళా కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలంతా ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారని, సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి ఓడిపోవడం ఖాయమని మండిపడ్డారు. కాగా, రాత్రి వరకు రామచంద్రయాదవ్ సభాస్థలంలోనే ఉన్నారు. పోలీస్ ఉన్నతాధికారులకు ఫోన్లు చేయగా ఎవరూ తీయలేదు. ఈ సభను అడ్డుకోవడానికి సంక్రాంతి సెలవులో ఉన్న పోలీసులను కూడా పిలిపించినట్లు తెలిసింది.

పెద్దిరెడ్డి కార్యకర్తల్లా పోలీసులు: యాదవ్

యూనిఫాం వేసుకున్న కార్యకర్తల్లా మంత్రి పెద్దిరెడ్డి కోసం పోలీసులు పనిచేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రామచంద్రయాదవ్ మండిపడ్డారు. ఎర్రచందనం స్మగ్లింగ్, ఇసుక దోపిడీని అడ్డుకోకుండా తమ సభలను భగ్నం చేయడమే డ్యూటీగా పనిచేస్తున్నారన్నారు. ఏకపక్షంగా పనిచేసే అధికారులకు రాబోవు రోజుల్లో శిక్ష తప్పదని హెచ్చరించారు. పుంగనూరు నియోజకవర్గంలో కొన్నేళ్లుగా పోలీసింగ్‌పై అనేక ఆరోపణలున్నాయని, పుంగనూరు, చౌడేపల్లె సీఐలు తమ స్వామి భక్తి చాటుకునేందుకు వీధిరౌడీల్లా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. తమ కార్యకర్తలను చెప్పులతో కొట్టే అధికారం ఎక్కడిదంటూ పోలీసులను నిలదీశారు.

సీఐ చెప్పుతో కొట్టడం సిగ్గుచేటు

బీసీవైపీ కార్యకర్తను గంగవరం సీఐ కృష్ణమోహన్ చెప్పుతో కొట్టడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు శుక్రవారం పేర్కొన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో సమస్యలపై ప్రతిపక్షాలు, కార్మికులు, ఉద్యోగులు ఎవరు గొంతు వినిపించినా పోలీసులు అణచివేతకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇలా, ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు.


రామచంద్రయాదవ్ కారుకు అడ్డంగా బైఠాయించిన కార్యకర్తలను లాగేస్తున్న పోలీసులు

జల్లికట్టు, కోడిపందేలకు అనుమతి లేదు

చిత్తూరు, జనవరి 12: జిల్లాలో జల్లికట్టు, కోడిపందేలకు అనుమతి లేదని ఎస్పీ రిషాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లాలోని పోలీసు అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. 'జిల్లాలో కోడి పందేల కట్టడికి రెవెన్యూ, జంతుసంక్షేమ సిబ్బంది, ఇతర విభాగాలతో కలిసి పోలీసులు చర్యలు తీసుకోవాలి. మండల స్థాయిలో తహసీల్దార్, ఎస్ఐ, జంతు సంక్షేమ బోర్డు సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి గ్రామాల్లో నిఘా ఉంచాలి. వీటిపై ఆటోల్లో ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలి. గ్రామస్థాయిల్లో సర్పంచులు, గ్రామ పెద్దలతో సీఐలు, ఎస్ఐలు సమావేశమై కోడి పందేలు జరగకుండా చూడాలి. పందేలు జరిగే ప్రాంతాల్లో డీఎస్పీలు పోలీసు పికెట్లు ఏర్పాటు చేయాలి. గతంలో కేసులున్న వారిని బైండోవర్ చేసుకోవాలి. కోడి పందేలకు స్థలాలిచ్చే వారిపైనా కేసులు నమోదు చేయాలి' అని సూచించారు. ఎక్కడైనా కోడి పందేలు,జల్లికట్టు జరిగితే పోలీసు వాట్సాప్ నెంబరు 94409 00005కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. సంక్రాంతి సెలవులకు ఊర్లకు వెళ్లే టీచర్లు, ఉద్యోగులు పోలీసులకు సమాచారం ఇస్తే వారి ఇళ్లకు సీసీ కెమెరా ఏర్పాటు చేసి నిఘా ఉంచతామన్నారు. జిల్లా ప్రజలకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.


ఎస్పీ రిషాంత్‌రెడ్డి



పండుగ కానుకలకు మంగళం

- వైసీపీ అధికారంలోకి వచ్చాక పేదల్ని పట్టించుకోని వైనం
- టీడీపీ హయాంలో నాలుగు రోజుల ముందే పేదింటికి కానుకలు

చిత్తూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో పండుగలు వచ్చాయంటే చాలు పేదింటికి సంక్రాంతి, క్రిస్మస్ కానుకలు చేరిపోయేవి. రంజాన్ తోఫాలతో సందడి నెలకొనేది. జగన్ సీఎం అయ్యాక ఈ కానుకలను ఎత్తేశారు. ప్రస్తుతం ఆకాశన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు పేదలను భయపెడుతున్నాయి. వీటిని కొనుగోలు చేయడం పేదలకు భారంగా మారింది. పండుగ నిర్వహణ వారిని కలవర పెడుతోంది. పండుగ పూట పేదలు పస్తులుండకూడదని భావించిన టీడీపీ ప్రభుత్వం సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ పండుగలకు కానుకలను పంపిణీ చేసేది. వైసీపీ రద్దు చేయడంతో అధిక ధరలు పెట్టి మార్కెట్‌లో కొనుగోలు చేయలేక కార్డుదారులు ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో పండుగల వేళ అందించిన కానుకలను పేదలు గుర్తు చేసుకుంటున్నారు. జిల్లాలో 5.41 లక్షల రేషన్‌కార్డులున్నాయి. వీరందరికీ ఆయా పండుగలకు ఆరు రకాల సరుకులను అందించింది. ఈ కిట్‌లో గోధుమ పిండి, కంది పప్పు కిలో చొప్పున, శనగపప్పు, బెల్లం అర కిలో చొప్పున, అర లీటరు పామాయిల్, వంద గ్రాముల నెయ్యి ఉండేవి. సాధారణ రేషన్ సరుకులతో పాటు పండుగకు నాలుగు రోజుల ముందే లబ్ధిదారులకు వీటిని అందించేవారు. దీంతో పండుగ పూట ఇంటిల్లిపాది పిండివంటలు చేసుకుని సంతోషించేవారు. క్రిస్మస్ సమయంలో ఇవే కానుకల్ని క్రైస్తవులకు పంపిణీ చేసేవారు. రంజాన్ తోఫా ద్వారా ముస్లిం కుటుంబాలకు 2 కిలోల చక్కెర, 5 కిలోల గోధుమ పిండి, కిలో సేమియా, వంద గ్రాముల నెయ్యి చొప్పున అందించేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక దాన్ని పట్టించుకోలేదు.

జిల్లాకు రూ.27 కోట్లు వెచ్చించలేరా?

కానుకలో అందించే ఆరు రకాల సరుకుల ధర ప్రస్తుతం మార్కెట్‌లో రూ.500 వరకు ఉంది. ఈ లెక్కన జిల్లాలోని రేషన్ కార్డుదారులందరికీ సంక్రాంతి కానుక అందించేందుకు రూ.27 కోట్లు అవుతుంది. పేదల కోసం ప్రభుత్వం ఆ మాత్రం కూడా వెచ్చించకపోవడంపై లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. రేషన్ షాపుల్లో పంపిణీ చేసే ఇతర నిత్యావసరాల పంపిణీని కూడా క్రమంగా కుదించుకుంటూ వచ్చారు. అప్పట్లో ఈ కిట్లను పంపిణీ చేసినందుకు రూ.10 చొప్పున డీలర్లకు అందించేశారు

'ఆడుదాం ఆంధ్ర'లో కొట్లాట

రామకుప్పం, జనవరి 12: రామకుప్పంలో శుక్రవారం నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర'లో రెండు కబడ్డీ జట్ల మధ్య కొట్లాట జరిగింది. మండల స్థాయి కబడ్డీ ఫైనల్స్ పోటీల్లో రామకుప్పం పంచాయతీ అయ్యప్పగానిపల్లె, కొంగనపల్లె పంచాయతీ కొళ్లపల్లె జట్లు తలపడ్డాయి. పోటీ జరుగుతుండగా అయ్యప్పగానిపల్లె జట్టుకు చెందిన రైడర్‌ను నిలువరించే ప్రయత్నంలో కొళ్ళపల్లె జట్టు సభ్యుడు అతడి చొక్కా పట్టుకున్నారు. దీంతో రెండు జట్ల మధ్య తలెత్తిన వాగ్వాదం కాస్త ఘర్షణకు దారి తీసింది. ఒకరొనొకరు తోసుకుంటూ, తన్నుకుంటూ, కొట్టుకున్నారు. అధికారులు, కొందరు ప్రజాప్రతినిధులు వారి మధ్య ఘర్షణ నివారించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు రంగప్రవేశం చేసి, ఇరు జట్ల సభ్యులకు సర్దిచెప్పారు.

గొబ్బి పాటలతో నిరసన

చిత్తూరు, జనవరి 12: అంగన్వాడీల సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరింది. ఇన్నాళ్లుగా తమ సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకు వెనక్కు తగ్గేదేలేదని స్పష్టం చేశారు. కార్వేటినగరంలో దీక్షా శిబిరం వద్ద సంక్రాంతి వేడుకలు నిర్వహించి, తమ సమస్యలను గొబ్బి పాటల రూపంలో పాడుతూ నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరు కలెక్టరేట్ వద్ద రిలేదీక్షలు కొనసాగించారు. పలమనేరులో శిబిరం వద్ద కూర్చుని నిరసన తెలిపారు. వీరికి జనవిజ్ఞాన వేదిక మద్దతు పలికింది.


కార్వేటినగరంలో భోగి మంట వేసి గొబ్బెమ్మ పాటలతో నిరసన

అంగన్వాడీలపై మొండిగానే..!

- 1,973 మందికి షోకాజ్ నోటీసులు
- గోడలకు అంటించిన అధికారులు
- 19లోగా వివరణ ఇవ్వకుంటే ఉద్యోగాలనుంచి తొలగిస్తామంటూ బెదిరింపులు

చిత్తూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీని సీఎంగా నెరవేర్చాలంటూ నెల రోజులకుపైగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల విషయంలో ప్రభుత్వం మొండివైఖరినే ప్రదర్శిస్తోంది. వారి సమస్యలు పరిష్కరించకపోగా, గతంలో కేంద్రాలను స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేశారు. తాజాగా వారిని అత్యవసర సేవల చట్టం (ఎస్మా) పరిధిలోకి తెచ్చి బెదిరించారు. జనవరి 5లోగా విధుల్లో చేరకుంటే తొలగిస్తామంటూ హెచ్చరించారు. అంతకుముందే పుంగనూరు వంటి ప్రాంతాల్లో వైసీపీ నాయకులు బెదిరించారు. ఇలాంటి బెదిరింపుల నేపథ్యంలో కొందరు విధుల్లో చేరారు. సింహభాగం అంగన్వాడీలు సమ్మెను మరింత ఉధృతం చేశారు. ఇప్పుడు బెదిరింపులు పతాక స్థాయికి చేరాయి. ఎస్మా చట్టంలో భాగంగా అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులను అందించారు. నోటీసులను చేతికి తీసుకోకుంటే వారి ఇళ్లకు, అంగన్వాడీ కేంద్రాలకు అతికించేశారు. పోస్టుల్లోనూ కొందరికి పంపించారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 1248 మంది అంగన్వాడీ కార్యకర్తలకు, 725 మంది ఆయాలకు షోకాజ్ నోటీసులను అందించినట్లు ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. ఈనెల 9వ తేదీతో జారీ అయిన నోటీసుల్లో పది రోజుల్లో వివరణ ఇవ్వకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంటే 19వ తేదీని గడువుగా నిర్ణయించారు. అప్పటిలోగా విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని చెబుతున్నారు.


ఐరాల మండలం కొండలరాజు కాల్వ అంగన్వాడీ కేంద్రానికి నోటీసు అతికిస్తున్న ఉద్యోగి

మూడు రోజులపాటు బ్యాంకులకు సెలవు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 12: జిల్లాలోని బ్యాంకులకు మూడు రోజులపాటు వరుస సెలవులు ఉంటాయని లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ హరీష్ తెలిపారు. 13న రెండో శనివారం, 14న ఆదివారం, 15న సంక్రాంతి కారణంగా బ్యాంకులు పనిచేయవన్నారు. 16 నుంచి యథావిధిగా పనిచేస్తాయని పేర్కొన్నారు.



నా ఎస్టీలు, నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనారిటీలు.. అంటూ జగన్‌రెడ్డి పదేపదే పాడే పాట వెనుక నిజం ఏమిటో ఎన్నికల వేళ వెల్లడవుతోంది. ఉమ్మడి జిల్లా సిటింగ్‌ల్లో తన సొంత సామాజికవర్గానికి తప్ప ఇంకెవరికీ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు ఆయన. రాబోయే ఎన్నికల్లో సీట్లు లేవంటూ కొందరిని, అటునిటు మార్చి కొందరిని, ఏమీ తేల్చకుండా మరికొందరిని మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. జగన్‌రెడ్డి తీరుతో ఎస్సీ, ముస్లిం, బలిజ సామాజిక వర్గాలు భగ్గుమంటున్నాయి. సొంత పార్టీలోనూ ఈ వర్గాలతో ఆయన రాజకీయ ఆటలు ఆడుకుంటున్నారు. - తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఆట గద జగనా!

వైసీపీలో ఎస్సీ, బలిజ, ముస్లిం సిటింగ్‌ల సీట్లు మాత్రమే గల్లంతు

భద్రంగా రెడ్డి సామాజిక వర్గం

గురువారం రాత్రి విడుదల చేసిన వైసీపీ మూడవ జాబితాలో ఉమ్మడి చిత్తూరు జిల్లా,తిరుపతి జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాలున్నాయి. ఒక ఎంపీ, ఐదుగురు ఎమ్మెల్యేల రాజకీయ భవితవ్యాలు తల్లకిందులయ్యాయి. గూడూరు, పూతలపట్టు ఎస్సీ సిటింగ్ ఎమ్మెల్యేలు వరప్రసాదరావు, ఎంఎస్ బాబులకు టికెట్లు గల్లంతయ్యాయి. సత్యవేడు ఎస్సీ సిటింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం తిరుపతి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయాల్సి వస్తోంది. అలాగే తిరుపతి ఎస్సీ సిటింగ్ ఎంపీ గురుమూర్తి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలవాల్సి వస్తోంది. మదనపల్లె ముసిం సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్ బాషా టికెట్ గల్లంతైంది. చిత్తూరులో బలిజ సిటింగ్ ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు టికెట్ సైతం గల్లంతైంది.

తగ్గి ఒంగినా.. పాపం బాబు!

2019లో అనూహ్యంగా పూతలపట్టు ఎమ్మెల్యే టికెట్ దక్కించుకున్న ఎంఎస్ బాబు, ఆ ఎన్నికల్లో ఒక పోలింగ్ కేంద్రం బ్యాలెట్ బాక్సులో నీళ్లు పోసేసి గ్రామస్తుల దాడికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఎమ్మెల్యేగా గెలిచినా ఆ అధికారాన్ని అనుభవించే అవకాశం వైసీపీలోని ఆధిపత్య కులానికి చెందిన మండల స్థాయి నాయకులు అయనకు దక్కకుండా ఇష్టానుసారం ఆడుకున్నారు. 2024లో తిరిగి టికెట్ దక్కించుకోవాలనే ఆశతోనే ఓపికగా అన్నీ భరించారు. ఇటీవల టికెట్ లేదనడంతో తీవ్ర మానసిక అశాంతితో కుంగిపోయారు. తన ఆవేదనను వెల్లడించారు. ఆ వెంటనే నాలుక కరచుకుని మాట మార్చారు. మంత్రి పెద్దిరెడ్డి పట్ల వినయాన్ని ప్రకటించారు. ఇదంతా టికెట్ మళ్లీ పొందాలనే తలొగ్గి చేశారు. అయినా చివరికి టికెట్ గల్లంతైంది. మాటా పోయి, మనసూ కలతచెంది మౌనంగా ఉన్నారు.




తలొగ్గక దెబ్బతిన్న నవాజ్‌బాషా



మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెత్తనం చెలాయిస్తున్న బడా నేతకు లొంగలేదు. ఆ నేత అడుగులకు మడుగులొత్తలేదు. మరో మహిళా నేతను ఆశ్రయించి ఆమె ద్వారా అధిష్ఠానానికి చేరువై నేరుగా పనులు చేసుకుంటూ వచ్చారు. ఆదే ఆయన పాలిట శాపమైంది. వైసీపీ అధికార సామాజిక వర్గం బడా నేత కన్నెర్రతో ఈ మైనారిటీ నాయకుడికి తేలిగ్గా బై చెప్పేశారు.

పెనం నుంచి పొయ్యిలోకి ఆదిమూలం



సత్యవేడు సిటింగ్ ఎమ్మెల్యే పరిస్థితి పెనంమీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యింది. ఆవిర్భావం నుంచీ కోనేటి ఆదిమూలం పార్టీలో వుంటూ 2014లో ఓడిపోయినా, 2019లో గెలిచారు. గెలుపు ఆనందం ఈ ఐదేళ్లలో ఆయనకు ఎన్నడూ దక్కలేదు.ముఖ్య నేతల వర్గాలు సొంత నియోజకవర్గంలో ఆయనకు స్వతంత్రత లేకుండా చేశాయి. ఆరోపణలు, నిందలతో ఆయన్ను ఉక్కిరిబిక్కిరి చేశారు. రెండు నెలలుగా టికెట్ దక్కదన్న ప్రచారం ఆయనకు, ఆయన కుటుంబానికి నరకం చూపింది. తీరా ఇప్పుడు సత్యవేడు లేదని, తిరుపతి ఎంపీ సీటిస్తామని తేల్చారు.

ఇది ప్రమోషనో, డిమోషనో అర్థంకాని అయోమయంలో ఆయన పడిపోయారు.

ఒక్క నియోజకవర్గంలోనే సతమతం అయిపోయిన ఆయనకు జిల్లా అంతా సమాళించుకోగల శక్తి సామర్థ్యాలు లేవు.


వరం దక్కని ప్రసాదు

గూడూరు సిటింగ్ ఎమ్మెల్యే వరప్రసాదరావు రిటైర్డు ఐఏఎస్ అధికారి. ఉద్యోగ విరమణ చేశాక వైసీపీలో చేరి 2014లో తిరుపతి నుంచీ ఎంపీగా పోటీ చేసి గెలిచారు. 2019లో గూడూరు ఎమ్మెల్యేగా పోటీ చేయమన్నారు. మూటాముల్లె సర్దుకుని అక్కడకు వెళ్ళి పోటీ చేసి గెలిచారు. 2024లో ఈ స్థానభ్రంశమూ లేదు. మాజీ ఐఏఎస్‌ను రాజకీయంగా నడిరోడ్డుపై నిలబెట్టింది వైసీపీ అధిష్ఠానం.



ఇలా అయిందేమిటి గురుమూర్తికి?

తిరుపతి ఎంపీ గురుమూర్తిదీ ఇదే పరిస్థితి. ఉప ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో గెలిచారు. సౌమ్యుడిగా పేరు తెచ్చుకున్నారు. వివాదరహితుడు. బడా నేతలందరితోనూ వినయంగా మసలేవారు. డిల్లీకి అలవాటు పడుతుండగానే ఆయనను అసెంబ్లీకి పరిమితం చేశారు. సత్యవేడును కేటాయించారు. ఈ మూడు నెలల్లో అక్కడ అన్నీ వెతుక్కోవాలి. తనకంటూ వర్గాన్ని నిర్మించుకోవాలి. ఆఖరి నిమిషంలో ఇదేమిటిలా అయిపోయిందే అనే దిగులుతో ఆయన ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.



రెపరెపలాడుతున్న ఆశలో ఆరణి

బడా నేతకు జీ హుజూర్ అన్నా చిత్తూరు టికెట్ రెండోసారి సిటింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు దక్కలేదు.సొంత ముద్రన్నదే లేకుండా అధికార సామాజికవర్గం బడా నేత చెప్పిందల్లా ఈయన చేశారు. అయితే బలిజ సామాజిక వర్గానికి చెందిన ఈయనకు చాపకింద నీరులా నియోజకవర్గంలో అగ్రవర్ణ నాయకుడిని సమాంతరంగా వెనుకనుంచి ఎగదోస్తూ వచ్చారు. చిత్తూరులో బలమైన సామాజికవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా సరే, చివరికి ఆయనకు టికెట్ దక్కలేదు. ఆయన సామాజికవర్గాన్ని దువ్వడానికి రాజ్యసభ ఆశ చూపుతున్నా అదెంతవరకూ నెరవేరుతుందో తెలియని పరిస్థితి. రాజ్యసభ తాయిలంతో గట్టిగా తిరగబడనూ లేక, నోరు తెరిచి అన్యాయం జరిగిందని అడగనూ లేక మౌన రోదనలో ఉన్నారు అరణి శ్రీనివాసులు.



అభద్రతలో వీరు

నియోజకవర్గ ఇన్‌చార్జులను ప్రకటించిన చోటే కాదు, మిగిలిన నియోజకవర్గాల వైసీపీ నేతల్లోనూ టెన్షన్ కొనసాగుతోంది. జీడీ నెల్లూరులో డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి, నగరిలో మంత్రి ఆర్కే రోజా, పలమనేరులో వెంకటేగౌడ, సూళ్ళూరుపేటలో కిలివేటి సంజీవయ్యలను ఇప్పటికీ అభద్రతా భావం వెన్నాడుతోంది. అధిష్ఠానం నారాయణస్వామికి టికెట్ నిరాకరించిందని తొలుత పార్టీలో ప్రచారమైంది. తర్వాత ఆయన బలిమాలుకోగా సీటు ఖరారు చేసినట్టు ప్రచారం జరిగింది. తాజాగా స్వామికి కాకుండా ఆయన కుమార్తె కృపాలక్ష్మి పేరు పరిశీలిస్తున్నట్టుగా ప్రచారమవుతోంది. వారంవారం వేర్వేరు ప్రచారాలు జరుగుతుండడంతో నారాయణస్వామి మానసిక వేదనకు గురవుతున్నట్టు సమాచారం. చీమ చిటుక్కుమన్నా చంద్రబాబుపై విరుచుకుపడే స్వామి ఇటీవల జోరు తగ్గించడం గమనార్హం. నగరిలో మంత్రి రోజాదీ అదే పరిస్థితి. మొదట్లో ఆమెకు టికెట్ లేదన్న వదంతులు ప్రబలాయి. ఓ దశలో తనకు టికెట్ రాకున్నా పరవాలేదని, పార్టీ కోసం త్యాగానికి సిద్ధమని ఆమె ప్రకటించారు కూడా. తర్వాత అధిష్ఠానం మెత్తబడి మళ్ళీ అవకాశమిస్తోందనే మాటలు వినిపించాయి. తరచూ చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్‌లపై విరుచుకుపడే రోజా కొంతకాలంగా మౌనం పాటిస్తున్నారు.ఇక సూళ్ళూరుపేటలో కిలివేటి సంజీవయ్యతో వైసీపీ అధిష్ఠానం పూటకో మాటతో ఆటాడుకుంటోంది. మూడో జాబితాలో సూళ్ళూరుపేటకు కొత్త వారిని ఇంచార్జిగా వేయకపోవడంతో హమ్మయ్య అంటూ తాత్కాలికంగా ఊపిరి తీసుకున్నారాయన. టికెట్ గురించి రెండు మూడు నెలలుగా సంజీవయ్య తీవ్ర మానసిక వ్యధ అనుభవిస్తున్నారు. పలమనేరులో వెంకటేగౌడ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. కాకపోతే ఆయనకు ప్రత్యామ్నాయం కోసం అధిష్ఠానం అన్వేషిస్తోంది. ఇటీవల వైసీపీలో చేరిన ఆర్వీ సుభాష్ చంద్రబోస్ పేరు టికెట్ రేసులో వినిపిస్తోంది. టికెట్ ఖరారయ్యే దాకా గౌడకు కూడా టెన్షన్ తప్పడం లేదు.

నిశ్చింతగా వారు

రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అత్యధిక ఎమ్మెల్యేలు మాత్రమే ఉమ్మడి జిల్లాలో నిశ్చింతగా ఉన్నారు. రాజంపేట ఎంపీ, వెంకటగిరి, తిరుపతి, చంద్రగిరి, పుంగనూరు, తంబళ్ళపల్లి, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెడ్డి సామాజికవర్గానికి చెందిన సిట్టింగు ఎమ్మెల్యేలు, ఇద్దరు వారసులకు టికెట్ భద్రత కల్పించింది అధిష్ఠానం. వెంకటగిరిలో ఆనం రామనారాయణ రెడ్డితో ఎప్పటికైనా సమస్య వస్తుందన్న భావనతో అధినేత ముందస్తుగానే నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి ప్రాధాన్యత ఇచ్చారు. ఆయనకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. ఆనంతో వ్యవహారం చెడగానే గంటల వ్యవధిలో రామ్‌కుమార్‌ను వెంకటగిరి ఇంఛార్జిగా నియమించేశారు. అప్పటి నుంచీ ఆయన నిశ్చింతగా ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు.శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్ళపల్లిలో మంత్రి సోదరుడు ద్వారకనాధరెడ్డి, పీలేరులో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వంటి పాతకాపులు టికెట్‌పై ధీమాగా వుండి ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. వీరికి భిన్నంగా ఎస్సీ, ముస్లిం, బలిజ సామాజికవర్గం సిటింగు ఎమ్మెల్యేలు టికెట్ పోగొట్టుకోవడమో లేక మరో స్థానానికి బదిలీ కావడమో జరుగుతోంది. దీంతో ఆయా వర్గాలకు చెందిన విద్యావంతులు, కాస్తోకూస్తో చైతన్యం కలిగిన వారు వైసీపీ అధిష్ఠానం తీరుతో రగిలిపోతున్నారు.

పలమనేరు వైసీపీ అభ్యర్థి ఎవరు?

- కొత్త జాబితాలోనూ దక్కని చోటు
- ప్రత్యామ్నాయం దొరకలేదా లేక సిటింగ్‌పై నమ్మకం లేకనా?

పలమనేరు, జనవరి 12: వైసీపీ విడుదల చేసిన మూడు జాబితాల్లోనూ పలమనేరుకు చోటు లేకపోవడం చర్చగా మారింది. సిటింగ్ ఎమ్మెల్యే వెంకటేగౌడకు మళ్లీ అవకాశం దక్కుతుందా, దక్కదా అనే మాటలు పెరిగాయి. వెంకటేగౌడకే మళ్లీ అవకాశం అని ఆయన వర్గం బలంగా చెబుతున్నప్పటికీ, వైసీపీ కార్యకర్తలే దీన్ని గట్టిగా నమ్మడం లేదు. ఇదే నిజమైతే ఆయన పేరు ఇప్పటికే ప్రకటించేసి ఉండేవారు కదా అంటున్నారు. టీడీపీ నుంచి మాజీ మంత్రి అమరనాథరెడ్డి బరిలో ఉంటారన్నది స్పష్టం. ఈయనను బలంగా ఎదుర్కొనే శక్తి వెంకటేగౌడకు లేదని వైసీపీ అధిష్ఠానం భావిస్తోందని ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికల్లో గెలిచినా, అది వైసీపీ గాలి బలమేనంటున్నారు. పార్టీ పలుమార్లు నిర్వహించిన సర్వేల్లో కూడా ఇదే తేలినట్టు చెప్పుకుంటున్నారు.

ఆయనకైతే పనిచేయమంటున్న నేతలు

నియోజకవర్గంలో పార్టీ ఇన్‌ఛార్జీల నియామకంలో వెంకటేగౌడ వ్యవహరించిన తీరుపై ఇప్పటికే ద్వితీయ శ్రేణి నేతల్లో అసంతృప్తి ఉంది. ఆయన వ్యవహార శైలి వల్ల ఇప్పటికే పలువురు మండల నేతలు పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యారు. పలమనేరులో అభ్యర్థిని మారిస్తే తప్పితే వీరు వైసీపీ అభ్యర్థి గెలుపుకోసం పనిచేసే అవకాశాలే లేవని తెలుస్తోంది. వెంకటేగౌడనే కొనసాగిస్తే వీరంతా ఈ ఎన్నికల్లో అమరనాథరెడ్డి గెలుపునకు పనిచేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ అసందిగ్ధత వల్ల వైసీపీలో మందకొడితనం పెరగగా, టీడీపీ నేతలు జోరుగా పర్యటనలతో దూసుకుపోతున్నారు.

సందడిలేని బోస్ : ఇటీవల వైసీపీలో చేరిన బాలాజి కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షుడు ఆర్.వి.సుబాష్‌చంద్ర బోస్ పేరు కూడా తరచూ ప్రచారంలోకి వస్తోంది. పెద్దిరెడ్డి ఆశీస్సులు అయనకు మెండుగా ఉన్నాయని, ఆయనకే టికెట్టు ఇస్తారని తొలుత ప్రచారం బలంగా జరిగింది. అయితే ఎందుకో తెలియదు గానీ ఆ తర్వాత పార్టీలో బోస్ హడావుడి ఏమీ లేకుండా పోయింది. దీంతో ప్రత్యామ్నాయాల మీదా చర్చ జరుగుతోంది. పెద్దిరెడ్డి కుటుంబంనుంచే మరొకరు పలమనేరులో పోటీ చేస్తారని వినిపించినా, అందుకు జగన్ ఒప్పుకోలేదని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అమరనాథరెడ్డిని ఢీకొనగలిగిన బలమైన నాయకుడి కోసం పార్టీ వెతుకుతున్నట్టు కూడా చెప్పుకుంటున్నారు. అందుకు తగిన ఆర్థిక వనరులుంటేనే టికెట్ ఇస్తారనీ లేకపోతే తిరిగి వెంకటేగౌడకే ఛాన్స్ దక్కుతుందని కూడా ప్రచారం అవుతోంది.

డీసీసీబీ పాలకవర్గ గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 12: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నాన్‌అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీతో కూడిన పాలకవర్గ గడువును మరో ఆరునెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఏడుగురు సభ్యులతో కూడిన పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్‌పర్సన్‌గా ఎం.రెడ్డెమ్మ ఉంటున్నారు. ప్రస్తుత పాలకవర్గ కమిటీ పదవీకాలం ఈనెల 17వ తేదీతో ముగియనుంది. ఈ పదవీకాలాన్ని 2024 జనవరి 18వ తేదీ నుంచి 2024 జూలై 17వ తేదీ వరకు ఆరునెలల పాటు లేదా ఎన్నికలు నిర్వహించేంతవరకు పొడిగిస్తున్నట్లు ఆ ఉత్తర్వులో పేర్కొంది.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై నివేదికలివ్వండి



ఎన్నికల అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 12: సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు శనివారంలోగా నివేదికలు ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. శుక్రవారం జడ్పీ సమావేశ హాలులో ఆయన ఎన్నికల అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలను పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని చెప్పారు. అక్కడకు వచ్చే ఓటర్లకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత తహసీల్దార్లు, కమిషనర్లు, పంచాయతీరాజ్, ఎస్ఎస్ఏ అధికారులదేనని స్పష్టంచేశారు. మరుగుదొడ్లు, తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు ఉండేలా చూడాలన్నారు. విభిన్న ప్రతిభావంతులైన ఓటర్ల కోసం ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 22న ఓటరు తుదిజాబితా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఎన్నికల నిర్వహణలో దోషరహిత ఓటరు జాబితా కీలకమని, అలాంటి జాబితా తయారీలో రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



ముగ్గు వేస్తున్న తెలుగుమహిళలు - సంస్కృతి, సంప్రదాయాలకు దర్పణంపట్టేలా ముగ్గులు

తెలుగు మహిళల సంక్రాంతి సంబరాలు

చిత్తూరు సిటీ, జనవరి 12: చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం తెలుగుమహిళల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. తెలుగు మహిళలు ముగ్గులు వేసి, పొంగళ్లు పెట్టి వేడుకలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న తెలుగుమహిళలు హాజరై ఆటల పోటీలు, ముగ్గులు వేశారు. వీరందరికీ జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు, టీడీపీ సీనియర్ నేత గురజాల చెన్నకేశవులు నాయుడు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు సంక్రాంతి కానుకను అందజేశారు. తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ, ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, మాజీ మేయర్ కటారి హేమలత, లత, రాణి, వరలక్ష్మి, నాగలక్ష్మి, శివకుమారి, చిత్ర తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి కానుక పంపిణీ చేస్తున్న దొరబాబు, చెన్నకేశవులు నాయుడు

నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది రోజమ్మా!

మంత్రికి టీడీపీ నేత బండారు సూచన ● నగరి కోర్టుకు హాజరైన సత్యనారాయణమూర్తి

నగరి, జనవరి 12: 'మాటలు సక్రమంగా మాట్లాడితే పరవాలేదు. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది రోజమ్మా' అంటూ మాజీ మంత్రి, టీడీపీ నేత బండారు సత్యనారాయణ మూర్తి వ్యాఖ్యానించారు. తనను అసభ్యంగా దూషించారంటూ ఆయనపై నగరి జుడిషియల్ కోర్టులో మంత్రి రోజా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు వాయిదాలో భాగంగా శుక్రవారం సత్యనారాయణమూర్తి నగరికి వచ్చారు. కాగా, ఈ కేసును ఫిబ్రవరి 13వ తేదికి వాయిదా వేస్తూ న్యాయమూర్తి విష్ణువర్మ ఆదేశాలిచ్చారు. కాగా, నగరిలో బండారు మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలను లొంగదీసుకోవాలని అక్రమ కేసులతో ప్రభుత్వం వేధిస్తోందన్నారు. తనపైనా పలు చోట్ల కేసులు పెట్టారని గుర్తుచేశారు. వైసీపీ నేతల దుశ్చర్యలపై తాము ఆధారాలతో ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయలేదన్నారు. ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రాన్ని బాగుచేయాలన్న దృక్పథంతో ప్రజల వద్దకు వెళుతున్నామని చెప్పారు. ఈ క్రమంలో ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదన్నారు. ఎన్నో కేసుల్లో నిందితుడైన జగన్ 2024 ఎన్నికల తర్వాత చంచలగూడకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. నాయకులు గుణశేఖర్, జ్యోతి నాయుడు, ఖాదర్‌భాయ్ రుక్కుం బాలాజీతో పాటు ఆయన వ్యక్తిగత లాయర్లు, నగరి టీడీపీ న్యాయవాది జగదీష్ పాల్గొన్నారు.



నగరి కోర్టుకు హాజరైన టీడీపీ సీనియర్ నేత బండారు సత్యనారాయణ మూర్తి

ఈసారైనా ఉంచుతారా.. మళ్లించేస్తారా?

● ఉమ్మడిజిల్లాకు రూ.22.79 కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 12: ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని గ్రామపంచాయతీలకు కేంద్రప్రభుత్వం రూ.22.79 కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. చిత్తూరు జిల్లాలోని 684 గ్రామపంచాయతీల్లో ఉన్న 14,36,580 మంది జనాభాకు రూ.11,52,29,049, తిరుపతి జిల్లాలోని 745 గ్రామాల్లో వున్న 13,65,904 మంది జనాభాకు రూ.11,27,13,553 విడుదలయ్యాయి. కాగా పొరుగున వున్న అన్నమయ్య జిల్లాలోని 490 గ్రామ పంచాయతీల్లో వున్న 13,51,740 జనాభాకు రూ.11,30,67,187 విడుదల చేసింది. 2022-23 సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు మూడు నెలల కిందటే విడుదల కావాలి. కానీ, రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకంతో కేంద్రం జాప్యం చేసింది. గతంలో విడుదల చేసిన 14వ, 15వ తొలివిడత ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ఛార్జీల బకాయిలకు మళ్లించింది. దీనిపై నాలుగు నెలలుగా సర్పంచులు తీవ్ర ఎత్తున నిరసన తెలిపారు. చేస్తున్నారు. మరోవైపు తెలుగుదేశం నాయకులు కేంద్రానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వీటిపై కేంద్రం విచారణ జరిపి, నిధుల మళ్లింపు నిజమేనని గుర్తించింది. కాగా, శుక్రవారం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్రప్రభుత్వం ఖాతాలో జమచేసింది. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో నేరుగా వేస్తుందా.. లేదా గతంలో వలే విద్యుత్ బకాయి చార్జీల పేరుతో మళ్లిస్తుందా అనేది చర్చనీయాంశమైంది. సాధారణంగా కేంద్రం ఇచ్చిన నిధులను సర్పంచుల అనుమతితో.. పంచాయతీ తీర్మానం చేశాకే ఇతరత్రా వాటికి మళ్లింపులు, ఖర్చులు చేయాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇవేవీ పట్టించుకోవడం లేదు.

కృష్ణాపురంలో ముగ్గుల పోటీలు



వి.కోట,జనవరి12: మండల పరిధిలోని కృష్ణాపురం ఉన్నత పాఠశాల మైదానంతో సంతూర్, విప్రో ఏరియా మేనేజర్ బాష నేతృత్వంలో మహిళలకు రంగవల్లి పోటీలు జరిపించారు. పెద్ద ఎత్తున మహిళలు హాజరై రంగురంగుల ముగ్గులు వేయడంతో మైదానం కళకళలాడింది. ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్ సతీష్‌కుమార్, విప్రో జేఎస్‌వో రాంమోహన్, ఎస్‌వో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత వివేకానంద



కేఈసీలో వివేకానందకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కుప్పం, జనవరి 12: దేశ యువతకే కాకుండా ప్రపంచానికే స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ.నాగరాజ్ అన్నారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ వివేకానంద స్ఫూర్తితో ప్రపంచ దేశాలలో తలయెత్తుకు తిరిగే భారత దేశాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేఈసీ వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ఆర్అండ్‌డీ డైరెక్టర్ జీఎం.కోదండరామయ్య, ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ మాధవన్, గంగాధరం, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి ఎన్టీయార్ స్మారక క్రికెట్ టోర్నీ

రామకుప్పం, జనవరి 12: రామకుప్పం మండలం పంద్యాలమడుగులో తెలుగు యువత ఆధ్వర్యంలో శనివారం నుంచి ఎన్టీయార్ స్మారక క్రికెట్ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్టు తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలంలు తెలిపారు. టోర్నీలో గెలుపొందే జట్లకు మొదటి, రెండు, మూడు, నాలుగో బహుమతులుగా రూ.50001, రూ.30001, రూ.20001, రూ.10001 అందజేస్తామని వారు తెలిపారు. అదేవిధంగా ప్రతి మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సీరీస్, బెస్ట్ బ్యాట్సుమెన్, బెస్ట్ బౌలర్ బహుమతులు అందజేస్తామని వారు తెలిపారు.

స్వామి వివేకానందకు ఘన నివాళులు



పలమనేరు, జనవరి12 : పలమనేరులో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి నిర్వహించారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయం వద్ద స్వామి వివేకానంద చిత్రపటాన్ని ఉంచి పూజలు చేసి నివాళులు అర్పించారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు తాతయ్యనాయుడు, యోగా గురువు నందగోపాల్, సామాజిక సేవాకార్యకర్త మధుమోహన్‌రావు, ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగి ఆనందతీర్థరావు, ఆంజినేయులు, జనార్థన్, సుబ్రమణ్యం, రమణలతో పాటు గ్రంథాలయ అధికారి హేమంత్‌కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

డిగ్రీకళాశాలలో : పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ విజయశేఖరం, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగిన క్రీడలు



సోమల, జనవరి 12: సోమల హైస్కూల్ ఆవరణ లో ఆడుదాం-ఆంధ్రా క్రీడలు శుక్రవారం హోరాహోరాగా సాగాయి. వాలీబాల్ పోటీ లు కందూరు-నెల్లిమంద టీముల మధ్య సాగి కందూరు జట్టు విజేతగా, కబడ్డీ పోటీ అన్నెమ్మగారిపల్లె-ఆవులపల్లె జట్ల మధ్య సాగి ఆవులపల్లె టీం విజేతగా నిలిచింది. విజేతలను అధికారులు అభినం దించారు. క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పించిన జగదీశ్‌ను ఎంపీపీ ఈశ్వ రయ్య, జడ్పీటీసీ కుసుమ, వైస్ఎంపీపీ ప్రభాకర్ సన్మానించారు. కార్యక్రమంలో పీడీలు కరుణానిధి, చిన్నప్ప, మల్లేశ్వరి, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక హైస్కూల్ ఆవరణలో శివాలయం రాయల్స్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో వీవీ. రమణ, విశ్రాంత ఎల్.ఐ. వెంకటరమణ, కె.నగేశ్, టి.సోమశేఖర్, డి.శంకరయ్య, జగన్, పీడీ కరుణానిధి, దామోదరం, సునీల్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై గ్రామీణులకు అవగాహన



వి.కోట,జనవరి12: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరుపై గ్రామీణులకు అవగాహన కల్పిస్తూ రెవెన్యూ అధికారులు పల్లెల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ చిట్టిబాబు నేతృత్వంలో మూడు రోజులుగా అధికారులు 70 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం యాలకల్లు, బైరుపల్లె, ఓగు పంచాయతీల్లో బీఎల్‌వోలు, బీఎల్ఏలు, వీఆర్‌వోలు ఆధ్వర్యంలో ఓటు వేయడం, వేసిన ఓటు వీవీ ప్యాడ్‌లో పడిందా లేదా అని గుర్తించడం ఎలా అన్న అంశాలపై అవగాహన కల్పించారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

కల్లూరు : పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి పంచాయతీలో శుక్రవారం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికెళ్లి పంపిణీ చేశారు. సర్పంచ్ ఉమాదేవి, ఎంపీటీసీ పోకల చంద్ర ఆధ్వర్యంలో అక్షింతలను వాహనంలో ఊరేగిస్తూ అన్ని గ్రామాలకు పంపిణీ చేశారు.

అభివృద్ధి చేయకపోతే ఓట్లకోసం వెళ్లేదెలా?

కుప్పం మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల నిలదీత



కుప్పం మున్సిపల్ కౌన్సిల్ మీట్‌లో ఛైర్మన్ సుధీర్ తదితరులు

కుప్పం, జనవరి 12: కుప్పం పురపాలక సంఘంలోని వార్డుల్లో అభివృద్ధి అనేది లేకుండా పోయిందని అధికార పార్టీ కౌన్సిలర్లు మండిపడ్డారు. అభివృద్ధి అనేది లేకపోతే త్వరలో వస్తున్న ఎమ్మెల్యే ఎన్నికలకు ఓట్లకోసం ప్రజల్లోకి ఎలా వెళ్లాలని అధికారులను నిలదీశారు. కుప్పం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఛైర్మన్ డాక్టర్ సుధీర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రూ.66 కోట్ల నిధులతో చేపట్టి పూర్తి చేసిన పనుల బిల్లులకు నగదు అకౌంట్లలో పడిందని అధికారులు తెలిపారు. అయితే మిగిలిన వార్డుల్లో చాలా వరకు పనులు చేయలేదని, నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడంలేదని పలువురు వైసీపీ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆయా పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిపక్ష టీడీపీ కౌన్సిలర్లు సైతం అభివృద్ధిపై ఛైర్మన్‌ను, అధికారులను నిలదీశారు. కనీసం జనరల్ ఫండ్స్‌తో కూడా పనులు కాలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ కౌన్సిలర్లు కోరినట్లు అన్ని అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసి, తగు నిధులు విడుదల చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌ను గద్దె దింపితేనే యువతకు భవిష్యత్తు



మాట్లాడుతున్న మాజీమంత్రి అమరనాథ రెడ్డి

గంగవరం, జనవరి 12 : జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులతోపాటు యువతను దగా చేసిన జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే యువతకు భవిష్యత్తు ఉంటుందన్న విషయాన్ని ప్రపతిఒక్కరూ గుర్తించాలని మాజీమంత్రి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం గంగవరం మండలంలోని చిన్నూరు, మన్నార్‌నాయినిపల్లె, నడింపల్లె, మొరవిండ్లు, పాతూరు, రెంటకుంట్ల, బీడీకాలనీ, డ్రైవర్స్‌కాలనీలలో ఆయన పర్యటించారు. చిన్నూరులో అమర్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా అభివృద్ధి మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా మారిందన్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ నమ్మించి, అధికారంలోకి వచ్చిన తరువాత జాబ్‌క్యాలెండర్ ఊసేలేదన్నారు. ఉన్న కంపెనీలకు పొగపెట్టి సాగనంపి అక్కడ పనిచేసే కార్మికులను కూడా రోడ్డున పడేసే దుస్థితిని తీసుకొచ్చారన్నారు. జనసైనికులు, టీడీపీ అభిమానులు కలసికట్టుగా కృషిచేస్తే జగన్ ప్రభుత్వం గాలిలో కొట్టుకుపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, మురళి, ఆనంద్, ప్రసాద్‌నాయుడు, రామ్మోహన్‌నాయుడు, బాలాజి, చిట్టిబాబు, బత్తిగౌడ్, రహీం, భరత్, గిరిధర్‌గోపాల్, అశోక్, శివకుమారి, జయమ్మ, వరలక్ష్మి, జనసేన దిలీప్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్య తీరేవరకు పోరాటం ఆగదు







పలమనేరులో అంగన్వాడీ వర్కర్లకు సంఘీభావం తెలుపుతున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు, కుప్పం, బైరెడ్డిపల్లెలలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కుప్పం, జనవరి 12: ఎవరు ఎన్ని అణచివేతలకు పాల్పడినా తాము ప్రభుత్వంపై చేస్తున్న పోరాటం ఆగేది కాదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. కుప్పంలో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 32వ రోజైన శుక్రవారంనాడు కూడా కొనసాగింది. సీఐటీయూ నాయకురాలు లలిత, అంగన్వాడీ యూనియన్ నేతలు మాట్లాడుతూ ఎస్మా ప్రయోగంతో తమ ఉద్యమాన్ని అణచివేతకు గురిచేయాలని చూస్తున్నారని, అది జరిగేపని కాదన్నారు. కాగా అంగన్వాడీల నిరసనకు సామాన్యులు కూడా మద్దతు ప్రకటిస్తున్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఎదుట అంగన్వాడీల దీక్షా శిబిరాన్ని శుక్రవారం సందర్శించిన సామాన్య వ్యక్తి ఒకరు, తాను కూడా వారితో కలిసి కాసేపు దీక్షల్లో పాల్గొన్నాడు. అంగన్వాడీల డిమాండ్లను వెంటనే ప్రభుత్వ పరిష్కరించాలని నినాదాలు చేశారు.

పలమనేరు : పలమనేరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం తమ కోర్కెల సాధన కోసం నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల ఆందోళన కార్యక్రమానికి జనవిజ్ఞానవేదిక నాయకులు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీలు గత 32 రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం స్పందించక పోవడం దారుణ మన్నారు. ప్రభుత్వం వారి కోర్కెలను ఆమోదించి వారి సమ్మెను విరమింప జేయాలని వారు విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక కడప జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా నాయకులు వైవీ నాగేశ్వరరావు, నాయకులు కుమారస్వామిరెడ్డి, ఏఐటీయూసీ, సీఐటీయూనాయకులు మంజునాథ్, గిరిధరగుప్తా, అంగన్వాడీవర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె : తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె ఆపేదిలేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. బైరెడ్డిపల్లె ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట శుక్రవారం కూడా వారు నిరసన కొనసాగించారు. తమ అపరిష్కృత సమస్యలపై ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీతోనే బీసీల అభ్యున్నతి



చంద్రశేఖర్‌రావు మృతికి సంతాపం తెలియజేస్తున్న బీసీ నాయకులు

కుప్పం, జనవరి 12: బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, , ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ బీసీ సెల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొలి నుంచి టీడీపీకి బీసీలు బాసటగా నిలుస్తున్నారని, వారు లేనిదే పార్టీ లేదన్నారు. పార్టీ కూడా బీసీలకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీ కార్పొరేషన్ల ద్వారా అవసరమైన రుణాలు అందించి ఉపాధి, ఉద్యోగ అవాశాలు కల్పించిందన్నారు. వైసీపీ హయాంలో బీసీలు దగా పడ్డారని, నిధులు విధులు లేని కార్పొరేషన్లకు ఛైర్మన్లు ఉత్సవ విగ్రహాలుగా మారారని విమర్శించారు. చంద్రబాబు బీసీల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నారని, అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దయిన పథకాలను పునరుద్ధరించి వారి సంక్షేమానికి కృషి చేస్తారని హామీ ఇచ్చారు. రామకుప్పం మండలం ఆవులకుప్పం గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర ఈడిగ సాధికార సమితి సభ్యుడు కె.చంద్రశేఖర్‌రావు మృతికి సమావేశం తీవ్ర సంతాపం ప్రకటించింది. ఆయన మృతి టీడీపీకి తీరని లోటని ఈ సందర్భంగా నాయకులు వ్యాఖ్యానించారు. ఆయన కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేతకు కన్నీటి వీడ్కోలు

రామకుప్పం : అనారోగ్యంతో మృతి చెందిన రామకుప్పం మండలం ఆవులకుప్పం గ్రామానికి చెందిన టీడీపీ ఈడిగ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు చంద్రశేఖర్ అంత్యక్రియలు శుక్రవారం జరిగాయి. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఎమ్మెల్సీ కంచర్లశ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పార్టీ కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మునిరత్నంతోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల నేతలు, కార్యకర్తలు చంద్రశేఖర్ మృతదేహాన్ని సందర్శించి, ఘననివాళులర్పించారు. వారు చంద్రశేఖర్ మృతి పట్ల తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి, కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ తరపున ఎమ్మెల్సీ శ్రీకాంత్ ఆయన కుటుంబసభ్యులకు రూ.50వేలు ఆర్థికసాయం అందజేశారు.

తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో నిరసన



రామకుప్పం, జనవరి 12: రామకుప్ప మండలం 90బందార్లపల్లె పంచాయతీ గెర్నపల్లెలో 15రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారంపై గ్రామస్తులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు బోరు మరమ్మతుకు గురికావడంతో రెండు వారాలుగా నీటికోసం నానాఅవస్థలు పడుతున్నారు. 300 కుటుంబాలున్న గ్రామానికి తాగునీరు రాకపోవడంతో వ్యవసాయ పొలాలు, ప్రైవేటు బోర్ల వద్ద జనం క్యూకట్టారు. సర్పంచ్‌కు తెలిపినా పట్టించుకోవడం లేదంటూ శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో ధర్నాకు దిగారు. ఈ విషయమై సర్పంచ్‌ను వివరణ కోరగా మోటారు మరమ్మతుకు గురి కావడంతో రిపేరు చేసి అమర్చగానే స్టార్టరు పాడైందని, దీంతో తాగునీటి ఇబ్బంది నెలకొందన్నారు. శనివారం లోపు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు.

అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులు

పలమనేరు, జనవరి12 : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి శుక్రవారం ఎమ్మెల్యే వెంకటేగౌడ నివాళులు అర్పించారు. ప్రభుత్వం విజయవాడలో ఈనెల 19వ తేది 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహంతోపాటు అంబేడ్కర్ స్మృతివనాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో శుక్రవారం పలమనేరు వైసీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే అంజినేయులు, ఎస్సీ ఉద్యోగుల సంఘ నాయకులు పుష్పరాజ్, బైరెడ్డి పల్లి జడ్పీటీసీ కేశవులు ప్రసంగించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ చాముండేశ్వరి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా వైసీపీ నాయకులు రక్తదానం చేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్ కుమర్‌రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు చెంగారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికితీయడానికే పోటీలు



పుంగనూరు రూరల్, జనవరి12: విద్యార్థుల్లో దాగి వున్న నైపుణ్యతను వెలికి తీయడానికే వక్తృత్వ, వ్యాసరచన, డ్రాయింగ్ కథలపై పోటీలు నిర్వహించినట్లు స్వామి వివేకనంద యువసేన ప్రతినిధి మణికంఠ తెలిపారు. శుక్రవారం కొత్తయిండ్లు సాయిబాబా కల్యాణ మండపంలో పోటీపరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు నాగరాజనాయక్, త్రిమూర్తిరెడ్డి, ఇంతియాజ్, మంజునాథ్, సుధీర్, సురేశ్, బాలసుబ్రహ్మణ్యం, కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ముస్లింలకు తీరని అన్యాయం

- గాజుల ఖాదర్‌బాషా

రామకుప్పం, జనవరి 12: వైసీపీ పాలనలో రాష్ట్రంలోని ముస్లింలకు తీరని అన్యాయం జరిగిందని టీడీపీ కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజులఖాదర్‌బాషా తెలిపారు. చంద్రబాబు తిరిగి సీఎం కావాలని, కుప్పంలో ఆయన లక్ష మెజారిటీతో గెలుపొందాలని కోరుతూ శుక్రవారం ఆయన రామకుప్పం జామియా మసీదులో స్థానిక ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో ముస్లింకు రక్షణ కరవైందన్నారు. ముస్లింలకు సబ్సిడీ రుణాలు, షాదీముబారక్ పెళ్ళికానుకలను కూడా ఆపేసిందన్నారు. కార్యక్రమంలో నేతలు సర్దార్, అన్సర్, సలాంసాబ్, ఆదిల్, జలీల్‌సాబ్, నియాజ్, అమానుల్లా, హనీఫ్, హఫీజ్, అక్బర్, అప్సా, నిసార్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


మృతుడికి ఘన నివాళి

కల్లూరు, జనవరి 12: పులిచెర్ల మండలం గంటావారిపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు గంటా రమేష్ తండ్రి వెంకటస్వామి గురువారం రాత్రి మృతి చెందడంతో టీడీపీ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి శుక్రవారం ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం టీడీపీ నాయకుడు గంటా రమేష్‌ను ఓదార్చారు.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం ఏకగ్రీవం

సోమల, జనవరి 12: ఎమ్మార్పీఎస్ మండల శాఖ నూతన కార్యవర్గ ఎంపిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగిందని ఆ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి రామనాథం తెలిపారు. మండల అధ్యక్షుడిగా ప్రభుకుమార్, ఉపాధ్యక్షుడిగా సురేంద్రబాబు, ప్రచార కార్యదర్శులుగా సుండు మణికంఠ, రవిలను, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడుగా పల్లెపాగు ప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా తోట లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎద్దుల కృష్ణయ్య, ప్రచార కార్యదర్శిగా వెంకట్రామయ్య, కార్యదర్శులుగా మంద సుబ్రహ్మణ్యం, వడ్డిపల్లె వినాయకను ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మురళి, ప్రభాకర్, నాగయ్య శివమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో మారెమ్మ



పుంగనూరు రూరల్, జనవరి12: పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి వేప, మామిడి ఆకులతో తోరణాలు కట్టి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ఆవులపల్లెలో ఆరోగ్య సురక్ష

సోమల,జనవరి12: మండలంలోని ఆవులపల్లె గంగమ్మ ఆలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి పలురకాల వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు జరిపారు. పెద్దఉప్పరపల్లె వైద్యాధికారి డాక్టర్ బాలాజీ సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ ప్రభాకర్, సర్పంచు కోదండరాజు, కార్యదర్శి మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డూరులో ...

బైరెడ్డిపల్లె, జనవరి12: మండలంలోని గడ్డూరులో శుక్రవారం ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాన్ని ఎంపీపీ రెడ్డెప్ప ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి

సోమల, జనవరి 12: పాడి రైతులు పశువులకు సోకే వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటిస్తూ వైద్యుల సలహాలు పాటించాలని ఏడీహెచ్ శ్రీనివాసులు నాయుడు అన్నారు. శుక్రవారం చింతపర్తివారిపల్లెలో జరిగిన పశువైద్య శిబిరంలో పశువులకు గాలికుంటు వ్యాధి, పిడుదల నివారణ టీకాలు వేశారు. గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి చందన ప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

బోయకొండలో రాహుకాల పూజలు



చౌడేపల్లె, జనవరి 13: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే వేదపండితులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, జనవరి12: మండలంలోని పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి వేద పండితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ నిర్వహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కేపీఎల్ టోర్నమెంట్ ప్రారంభం

చౌడేపల్లె, జనవరి12: మండలంలోని దాదేపల్లె సమీపంలో ఉన్న నారాయణరాజు మెమోరియల్ గ్రౌండ్‌లో శుక్రవారం కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. సంక్రాంతి పర్వదినాన్ని పురష్కరించుకుని 3 రోజులపాటు క్రీడలు నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. ప్రథమ బహుమతి ఒక లక్ష రెండవ బహుమతి రూ.75వేలు, మూడవ బహుమతి రూ.50వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రికెట్ పోటీలలో వీరప్పల్లె, ఎర్రప్పల్లె జట్లు తలపడగా వీరప్పల్లె జట్టు విజేతగా, పాపిశెట్టిపల్లె, మేకలచిన్నేపల్లె జట్లు తలపడగా పాపిశెట్టిపల్లె విజేతగా, పుంగనూరు-1, పందిళ్లపల్లె జట్లు తలపడగా పుంగహూరు-1విజేతగా, పుంగనూరు-2, రాజులురు జట్లు తలపడగా రాజులురు జట్టు విజేతలుగా నిలిచాయి.

కార్యకర్త కుటుంబానికి సాయం

కుప్పం రూరల్, జనవరి 12: మండలంలోని వానగుట్టపల్లె ఎస్సీ కాలనీకి చెందిన గుండప్ప అనే టీడీపీ కార్యకర్త అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. టీడీపీ నాయకులు ఆయన మృత దేహానికి నివాళులర్పించారు. అలాగే పార్టీ తరఫున మట్టి ఖర్చులకు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని మృతుడి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కుప్పం మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, పార్టీ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, స్థానిక నాయకులు రాజగోపాల్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

రామకుప్పం, జనవరి 12: రామకుప్పం మండలం రాజుపేట పంచాయతీ యానాదికాలనీకి చెందిన రాజప్ప శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మండల ప్రధానకార్యదర్శి నరసింహులు, స్థానిక నేతలు నారాయణస్వామి, మురుగేష్ తదితరులు ఆయన మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి పార్టీ తరపున రూ.10వేలు అందజేశారు.

28న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక



పుంగనూరు రూరల్, జనవరి12: ఈ నెల 28న తిరుపతిలోని పాదుకా మండపంలో బ్రాహ్మణ వివాహవేదిక పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు ఆ సంఘ కార్యదర్శి రామమూర్తి తెలిపారు.శుక్రవారం బ్రహ్మణవీధిలో వధూవరుల వివాహ వేదిక పోస్టర్లు విడుదల చేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వరసిద్ధుడి ఆలయానికి రూ.3.03 లక్షల విరాళం


చెక్కును ఆలయ అధికారులకు అందజేస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), జనవరి 12: కాణిపాక వరసిద్ధుడి ఆలయానికి విశాఖపట్టణానికి చెందిన వెంకటసత్యనారాయణమూర్తి రూ.3,03,348 చెక్కును గురువారం విరాళంగా అందించారు. ఈ విరాళంలో ఆలయం వద్ద నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి రూ.1,01,116, గో సంరక్షణ ట్రస్టు నిర్వహణకు రూ.1,01,116, ఆలయ అభివృద్ధి పనులకు రూ.1,01,116ను వినియోగించాలని ఆయన అధికారులను కోరారు. అనంతరం దాతను సూపరింటెండెంట్ వాసు స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

జీజేఎం ఆధ్వర్యంలో సంక్రాంతి కానుకల పంపిణీ

- సుమారు రూ.4 కోట్ల విలువచేసే 50 వేల కిట్లు


సంక్రాంతి కానుకల వాహనాలను ప్రారంభిస్తున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, జనవరి 12: జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత గురజాల జగన్మోహన్ సంక్రాంతి పండుగ సందర్భంగా చిత్తూరు నియోజకవర్గంలోని కుటుంబాలకు సుమారు రూ.4 కోట్ల విలువచేసే సంక్రాంతి కానుకలను పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో నగరంలోని 50 డివిజన్‌లకు సంక్రాంతి కానుకను పంపిణీ చేయడానికి ఏర్పాటు చేసిన టాటా ఏస్ వాహనాలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15న తన జన్మదినం సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి కానుకను అందిస్తున్నానని చెప్పారు. చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ ఎవరికిస్తారని విలేకరులు అడిగిన ప్రశ్నకు, పార్టీ అధిష్టానం టికెట్ ఎవరికిచ్చినా వారి గెలుపునకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తాం

కార్వేటినగరం, జనవరి 12: కార్వేటినగరం ఎంఈడీవో కార్యాలయం వద్ద శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించిన అనంతరం తమ సమస్యలు తీర్చాలని భోగి మంటలు వేసి, గొబ్బెమ్మ పాట రూపంలో వినిపించి అంగన్వాడీలు నిరసన తెలిపారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించేవరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని ఈ సందర్భంగా అంగన్వాడీలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

24న డివిజన్ స్థాయి డాక్ అదాలత్ కార్యక్రమం

చిత్తూరు రూరల్, జనవరి 12: చిత్తూరులోని హెడ్ పోస్టాఫీసు కార్యాలయంలో ఈ నెల 24వ తేదీన డివిజన్ స్థాయి డాక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ లక్ష్మణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కి సంబంధించిన ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఈ నెల 22వ తేదీలోపు సూపరింటెండెంట్ కార్యాలయానికి పంపించాలని ఆయన పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు నేరుగా రావాల్సిన అవసరం లేదని, తాము ఫిర్యాదు పరిశీలించి తగిన పరిష్కారం చేసి ఉత్తరం ద్వారా కానీ, మెయిల్ ద్వారా కానీ తెలియజేస్తామని ఆయన తెలిపారు.

నలగాంపల్లిలో మిస్సిండియా కిరణ్‌ప్రీతి సందడి



బంగారుపాళ్యం, జనవరి 12: బంగారుపాళ్యం మండలం నలగాంపల్లి గ్రామానికి చెందిన లగడపాటి పార్థసారథి నాయుడు, కృష్ణకుమారిల కుమార్తె కిరణ్ ప్రీతి అమెరికాలోని డెల్లావేర్ యూనివర్శిటీలో ఎం.ఎస్. చదువుతూ 2023లో యూనివర్శిటీ నిర్వహించిన అందాలపోటీల్లో మిస్సిండియాగా ఎంపికైంది. ఈమె స్వగ్రామమైన నలగాంపల్లికి శుక్రవారం చేరుకుంది. ఆమెకు గ్రామస్తులు, అభిమానులు స్వాగతం పలికారు. కిరణ్ ప్రీతి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ జరుపుకోవడానికి ఇండియాకు వచ్చినట్లు తెలిపారు. ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెనుమూరు, జనవరి 12: మండలంలోని శ్రీనివాసపురం, ఎల్‌కేపీఊరు, సీఆర్ కండ్రిగ, ఉగ్రాణంపల్లి, సామిరెడ్డిపల్లి, తాటిమాకులపల్లి, గొబ్బిళ్లమిట్ట, మాణిక్యరాయనిపల్లి ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు కళావతి శుక్రవారం తనిఖీచేశారు. కొన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు సక్రమంగా లేకపోవడంతో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు వాటిని ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. ఆమెతో పాటు బీఎల్‌వోలు, వీఆర్‌వోలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిత్తూరు రూరల్, జనవరి 12: చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని కొత్తపల్లిమిట్ట 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం పెనుమూరు, జీడీ నెల్లూరు, పాలసముద్రం మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పద్మనాభపిళ్లై ఒకప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

లారీ, ద్విచక్రవాహనం ఢీ: ఇద్దరికి గాయాలు


గాయపడ్డ సాయి శరత్ రెడ్డి

బంగారుపాళ్యం, జనవరి 12: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి కాటప్పగారిపల్లె సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. యాదమరి మండలం పత్రపల్లికి చెందిన సాయి తిలక్, చౌడేపల్లికి చెందిన సాయి శరత్‌రెడ్డిలు తమ ద్విచక్రవాహనంలో చౌడేపల్లికి వెళుతూ, అదే వైపు వెళ్తున్న లారీని వీరు వెనుకభాగంలో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సాయిశరత్ రెడ్డి తలకు తీవ్ర గాయాలు కాగా, సాయి తిలక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 ద్వారా చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా స్వాధీనం: ఒకరి అరెస్టు

గుడిపాల, జనవరి 12: మండలంలోని చీలాపల్లి క్రాస్ వద్ద ఓ వ్యక్తి సారా విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు గుడిపాల ఎస్‌ఐ రామ్‌మోహన్ తెలిపారు. నరిగపల్లికి చెందిన సుకుల్ అనే వ్యక్తి చీలాపల్లి క్రాస్ వద్ద సారా విక్రయిస్తుండగా అతడి దగ్గరనుంచి ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

పెనుమూరు, జనవరి 12: పెనుమూరు మండలంలోని సీఆర్ కండ్రిగ సమీపంలో ట్రైనీ డీఎస్పీ పావన్‌కుమార్ శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా, ద్విచక్రవాహనంలో 21 క్వార్టర్ మద్యం బాటిళ్లను తీసుకు వెళుతున్న సీఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన రవీంద్రరెడ్డిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న మద్యంను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు. అలాగే ద్విచక్ర వాహనాన్ని కూడా సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రక్తదాన శిబిరం

నగరి, జనవరి 12: నగరి పట్టణ పరిధిలోని ఏరియా వైద్యశాలలో శుక్రవారం ఆర్డీఓ సృజన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో డాక్టర్ రవిరాజు, డాక్టర్ ప్రభావతి, స్థానిక వైద్యులు పాల్గొని రక్త సేకరణ చేపట్టారు. ఆర్డీఓ సృజన మాట్లాడుతూ రక్తదానం అన్నిదానాల్లో కన్నా మిన్న అని చెప్పారు. ఈ సందర్భంగా 18 మంది యువకులు రక్తదానం చేశారు.

బ్యారికేడ్ల వితరణ

చిత్తూరు, జనవరి 12: నగరంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం నాగార్జున సిమెంట్స్ నిర్వాహకులు 30 బ్యారికేడ్లను శుక్రవారం వితరణ చేశారు. ఈ బ్యారికేడ్లను ట్రాఫిక్ డీఎస్పీ విష్ణు రఘువీర్, సీఐ నిత్యబాబు, ఎస్‌ఐ బాబు సమక్షంలో నాగార్జున సిమెంట్స్ కంపెనీ రీజనల్ మేనేజర్ నందన్‌రావు, సీనియర్ సేల్స్‌ఆఫీసర్ నగేష్‌కుమార్‌లు అందించారు. బ్యారికేడ్లను అందించిన వారికి పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.

దుస్తుల పంపిణీ



వెదురుకుప్పం, జనవరి 12: మండలంలోని నల్లవెంగనపల్లెలో టీడీపీ మండల నాయకుడు కావలి రాజేంద్రన్ సంక్రాంతి కానుకగా 60 మంది మహిళలకు శుక్రవారం దుస్తులు పంపిణీచేశారు. ప్రతీ ఏటా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముందస్తుగా పేద మహిళలకు దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కలవగుంటలో ఆరోగ్య సురక్ష

పెనుమూరు, జనవరి 12: మండలంలో రెండవ విడత ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం కలవగుంటలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె వైద్యం కోసం వచ్చిన పలువురు రోగులకు పరీక్షలు చేశారు. 51 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అనిల్‌కుమార్, మీనాసయ్యద్, మధుసూదన్, హర్షవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

309 మందికి పరీక్షలు

వెదురుకుప్పం, జనవరి 12: మండలంలోని జక్కిదొన గ్రామ సచివాలయం వద్ద రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా 309 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు.

జాతీయ రహదారి నిర్మాణంతో పంట పొలాలు ఎడారి కావాల్సిందేనా..?

- సాగునీరు, దారి సౌకర్యం నిల్
- పట్టించుకోవాలంటూ రైతుల మొర


పొలాల మధ్యలో నుంచి నిర్మించిన రోడ్డు

నింద్ర, జనవరి 12: మండలంలో బెంగళూరు-తచ్చూరు జాతీయరహదారి నిర్మాణంకోసం భూములు కోల్పోయిన రైతులు తమ పొలాలు ఎండమావులుగా మారే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. భవిష్యత్తును తలుచుకుంటూ ఆవేదన చెందుతున్నారు. వివరాలు ఇలా.. నింద్ర మండలం పాదిరి గ్రామం లెక్క దాఖలాలో చెరువు కింద సుమారు 20 మంది రైతులకు 70 ఎకరాలు పంట సాగు భూమి ఉండేది. ప్రస్తుతం జాతీయ రహదారి నిర్మాణంలో కొంత భూమి కోల్పోయినా మిగిలిన భూములు రోడ్డుకు ఇరువైపులా ఉన్నాయి. చెరువు నుంచి వచ్చేనీరు, పంట పొలాలకు వెళ్లే రహదారి జాతీయ రహదారితో కనుమరుగయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. భూసేకరణ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో భూములు కోల్పోయిన వారికి అండగా ఉంటామని అధికారులు చెప్పారని రైతులు అంటున్నారు. నష్ట పరిహారం చెల్లింపు కూడా సక్రమంగా జరగలేదని, పంట పొలాలకు భవిష్యత్తులో సా గునీరు అందే పరిస్థితి కనిపించడం లేదని, కనుమరుగైన చెరువు తూము ఏర్పాటుకు ప్రత్యామ్నాయంగా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పంట సాగుకు ఇబ్బందిగా ఉంది



నాకు మొత్తం 5 ఎకరాల పంట పొలం ఉంది. అందులో జాతీయ రహదారికి ఒక ఎకరా 25 సెంట్లు పోగా, మిగిలిన భూమి రోడ్డుకిరువైపులా ఉండటంతో సాగు చేయాలంటే నీరు, రహదారి లేక ఇబ్బందిగా ఉంది.

- రైతు, చిరంజీవుల నాయుడు, పాదిరి

సాగుకు నీరు, దారి సౌకర్యం కల్పించండి



నాకు పాదిరి గ్రామ లెక్క దాఖలాలో 7 ఎకరాల పంట పొలం ఉంది. అందులో 1/2 ఎకరం జాతీయ రహదారిలో పోయింది. మిగిలిన పొలంలో పంట సాగు చేయాలన్నా నీరు, రహదారి లేక ఇబ్బంది పడుతున్నాను.

- రైతు, లక్ష్మీకాంతం, పాదిరి

ప్రకృతి సంపదను దోచుకుని వేలకోట్లు దండుకోవడంలో
వైసీపీ నేతలే టాప్: థామస్


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ థామస్, పక్కన రవిప్రకాష్

గంగాధరనెల్లూరు, జనవరి 12: ప్రకృతి సంపదైన ఎర్రచందనం, మట్టి, గ్రానైట్‌క్వారీలను, ఇసుకను చిత్తూరు జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అక్రమంగా దోచుకుని, వేలకోట్లను దండుకోవడంలో వైసీపీ నేతలే టాప్‌లో నిలిచారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ థామస్ ఆరోపించారు. జయహో టీడీపీ బీసీ కార్యక్రమంలో భాగంగా జిల్లా టీడీపీ యాదవ సాధికారసమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ అధ్యక్షతన ఆటోలు, ద్విచక్రవాహనాలతో థామస్ కారుపై నిల్చొని రెండు చేతులతో విక్టరీ చూపిస్తూ గంగాధరనెల్లూరు నుంచి చిత్తూరు సరిహద్దు హెరిటేజ్ డెయిరీ వరకు.. మళ్లీ అక్కడ నుంచి గంగాధరనెల్లూరు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా థామస్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పిస్తే వైసీపీ ప్రభుత్వంలో కేవలం 24శాతం మాత్రమే పదవులను కట్టబెట్టారన్నారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు రవిప్రకాష్ మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు, నేతలు కలిసికట్టుగా నూరురోజులపాటు పనిచేసి డాక్టర్ థామస్‌ను ఈసారి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించుకుని సత్తాచూపించాలని కోరారు. బీసీలకు అన్నిరకాల భరోసాతో చేయూత కల్పించింది ఒక్క టీడీపీ ప్రభుత్వ హయాంలో మాత్రమేనన్నారు. జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్, నియోజకవర్గ టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు రవియాదవ్, జిల్లా టీడీపీ లీగల్ సెల్ ప్రధానకార్యదర్శి లాయర్ శరవణకుమార్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు గురసాల కిషన్‌చంద్, బీసీసెల్ మాజీ ఉపాధ్యక్షుడు నటరాజ్‌మొదలి ప్రసంగించారు. నేతలు వెంకటేష్, రాంబాబురెడ్డి, కోదండరెడ్డి, చెంగ్రాయయాదవ్, లోకనాథరెడ్డి, జ్యోతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు (సెంట్రల్), జనవరి 12: స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ షన్మోహన్ సూచించారు. శుక్రవారం స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో నెహ్రూయువ కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ ప్రదీప్, డీఆర్‌డీఏ పీడీ తులసి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ షన్మోహన్ మాట్లాడుతూ యువతలోని మంచి ఆలోచన ధోరణి వారిని ఏదైనా సాధించేలా చేస్తుందని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువత ఓటరుగా నమోదు చేసుకుని దేశాభివృద్ధికి తమ వంతు బాధ్యత వహించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమలో డీజేఎం సరిత, ఎన్‌వైకే అకౌంట్స్ అధికారి బాబురెడ్డి, ఎన్‌జీవోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిపాల: స్వామి వివేకానంద జయంతి వేడుకలను స్థానిక సీఎన్‌ఆర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపకుడు లోకేష్, ప్రిన్సిపల్ రామచంద్ర, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద

చిత్తూరు (సెంట్రల్), జనవరి 12: యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తి ప్రదాతని స్వామి వివేకానంద ఫౌండేషన్ సభ్యులు కొనియాడారు. జాతీయ యువజన దినోత్సవం, వివేకానంద జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం కట్టమంచిలోని వివేకానంద పార్క్‌లో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం రామకృష్ణ సేవా సమితి కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప ఆధ్యాత్మిక వేత్తగా వివేకానందుడు దేశ చరిత్రలో విలువైన స్థానం సంపాదించుకున్నాడని కొనియాడారు. ఫౌండేషన్ అధ్యక్షుడు జయకుమార్ మాట్లాడుతూ నేటి యువతరానికి వివేకానందుడు ఆదర్శప్రాయుడుగా అభివర్ణించారు. అనంతరం పలువురికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో శరత్చంద్రశేఖర్, శర్మ, కిరణ్, యువత పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాన్ని కబ్జా చేశారు


మాట్లాడుతున్న ముక్కాబి

చిత్తూరు సిటీ, జనవరి 12: ప్రభుత్వం తనకు ఇచ్చిన ఇంటి స్థలాన్ని కొందరు దౌర్జన్యంగా కబ్జా చేశారని ముక్కాబి అనే మహిళ ఆరోపించారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ మురకంబట్టు బైపాస్ రోడ్డులోని ఇందిరమ్మకాలనీలో ప్రభుత్వం తనకు 2006వ సంవత్సరంలో రెండు సెంట్ల ఇంటిస్థలం ప్లాట్ నెం.384 పట్టా ఇచ్చిందన్నారు. తన ఆర్థిక పరిస్థితి బాగాలేనందున ఆ స్థలంలో గుడిసె వేసుకుని జీవిస్తున్నానని చెప్పారు. ఈ గుడిసెకు ఇంటిపన్ను, కరెంటు బిల్లు, నీటి బిల్లు కూడా చెల్లిస్తున్నానని పేర్కొన్నారు. కాగా వెంగనపల్లెకు చెందిన కొందరు దౌర్జన్యంగా తన గుడిసెను పీకివేసి ఆ స్థలాన్ని ఆక్రమించారని వాపోయారు. ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

టీడీపీ నేతకు భానుప్రకాష్ నివాళి



నగరి, జనవరి 12: నగరి మండలం, నాగరాజకుప్పం పంచాయతీలోని కన్నికాపురం గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు రవియాదవ్ మృతదేహానికి శుక్రవారం నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. రవియాదవ్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, మణి, వరదారాజులు పాల్గొన్నారు.

డీసీసీబీ సర్వసభ్య సమావేశం తేదీ మార్పు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 12: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సర్వసభ్య సమావేశం ఈనెల 17న ఉదయం 11 గంటలకు స్థానిక బ్యాంకు ప్రధాన కార్యాలయం ఆవరణలో చైర్‌పర్సన్ ఎం. రెడ్డెమ్మ అధ్యక్షతన జరుగుతుందని సభ్యులకు ఇదివరకే తెలిపారు. అయితే అనివార్య కారణాలతో సమావేశ తేదీని 19వ తేదీ శుక్రవారం నాటికి మార్పుచేసినట్లు బ్యాంకు సీఈవో మనోహర్ గౌడ్ తెలిపారు.

ముగిసిన ఆడుదాం ఆంధ్ర క్రీడలు

వెదురుకుప్పం, జనవరి 12: వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడలు శుక్రవారంతో ముగిశాయని ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మండల స్థాయి పోటీలను నిర్వహించామని పేర్కొన్నారు. ఈ క్రమంలో పురుషుల విభాగంలో కబడ్డీలో బ్రాహ్మణపల్లి, బ్యాడ్మింటన్‌లో పచ్చికాపల్లం, వాలీబాల్‌లో దేవరగుడిపల్లె సచివాలయాల వారు విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. మహిళా విభాగంలో కబడ్డీలో తిరుమలయ్యపల్లె, బ్యాడ్మింటన్‌లో బ్రాహ్మణపల్లె, ఖోఖోలో దేవరగుడిపల్లె సచివాలయాల వారు విజేతలుగా నిలిచినట్లు తెలిపారు.

పాలసముద్రం: మండలంలో శుక్రవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా వాలీబాల్ పోటీల్లో తిరుమలరాజుపురం సచివాలయం మహిళలు గెలుపొందారని, క్రికెట్‌పోటీల్లో క్రిష్ణజిమ్మాపురం సచివాలయం ఆటగాళ్లు గెలుపొందారని ఎంపీడీవో రామనాథ రెడ్డి పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లే ఈ పోటీలను నిర్వహిస్తున్నారు.

బంగారుపాళ్యం: ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి క్రీడాపోటీల్లో భాగంగా తగ్గువారిపల్లె క్రీడామైదానంలో శుక్రవారం తగ్గువారిపల్లి జట్టు, ముంగరమడుగు జట్టు మధ్య కబడ్డీ పోటీ హోరాహోరీగా సాగింది. మొదటి స్థానంలో తగ్గువారిపల్లి జట్టు గెలుపొందగా, రెండో స్థానంలో ముంగరమడుగు జట్టు నిలిచినట్లు ఎంపీడీవో హరిప్రసాద్ తెలిపారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు


హార్వర్డ్‌లో భోగి మంటలు వేస్తున్న విద్యార్థినులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 12: నగరంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాంనగర్ కాలనీలోని హార్వర్డ్ పాఠశాలలో కరస్పాండెంట్ భాస్కర్ అధ్యక్షతన విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి, భోగిమంటలు వేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. గిరింపేటలోని దేవి స్కూల్లో కరస్పాండెంట్ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి.

చట్టవ్యతిరేక పనులు చేస్తే జైలుకే

పూతలపట్టు, జనవరి 12: ఎవరైనా చట్టవ్యతిరేక పనులు చేస్తే కచ్చితంగా జైలుకు పంపిస్తామని పూతలపట్టు ఎస్‌ఐ రామ్‌భూపాల్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలన్నారు. పండుగ సందర్భంగా ఎవరైనా కోడిపందేలు, పేకాట ఆడినట్లు తమ దృష్టికి వస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. గతంలో కోడిపందేలు, జూదం మండలంలో జరిగిన సందర్భాలున్నాయని, అటువంటివి పునరావృతమైతే జైలుకెళ్లడం తప్పదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా ఇలాంటి ఘటనలకు పాల్పడితే ప్రజలు తమ దృష్టికి తేవాలన్నారు.

17న గోటు (వనభోజన) ఉత్సవాలు

చిత్తూరు కల్చరల్, జనవరి 12: నగరంలో సంక్రాంతి పండుగ ముగియగానే ఆ మరుసటి రోజు అనగా ఈనెల 17న గోటు (వనభోజన) ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. నగరవాసులు స్థానిక గంగినేని చెరువు పార్కు, అటవీశాఖ చిన్నారుల పార్కు, జూపార్కు, బీ.వీ.రెడ్డి కాలనీ పార్కు, సంతపేట విజయలక్ష్మి కాలనీ, ఎంజీ బ్రదర్స్ పార్కు, ప్రశాంత్‌నగర్ కాలనీ గుట్టల్లో ఇంటిల్లిపాది తరలి వెళ్లి రోజంతా ఎంతో ఉత్సాహంగా గడిపి అక్కడ వన భోజనాలు చేస్తారు.

ఆలయం ముందు మురుగు నీరు


దుర్గంధం వెదజల్లుతున్న మురుగు కాలువ

కార్వేటినగరం, జనవరి 12: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయం ముందు ఉన్న మురుగు కాలువలో నీరు పొంగి రోడ్డుపైకి పారుతోంది. దీంతో ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. డ్రైనేజి నీరు పొంగి పొర్లడంతో దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు నీరు వలన ఆలయం లోపలకు వెళ్లే భక్తులు నానావస్థలు పడుతున్నారు. మురుగు కాలువపైన ఎటువంటి మూత లేకపోవడంతో దుర్గధం వెదజల్లుతోంది. ఇప్పటికైనా ఆలయాధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్


గుడిపాల, జనవరి 12: పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. శుక్రవారం 176వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఏకాంబరం, బాల, సుబ్రహ్మణ్యం, రవి నాయుడు, సుధాకర్ యాదవ్, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



బంగారుపాళ్యం, జనవరి 12: మండల కేంద్రంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద గల అన్నక్యాంటీన్‌లో శుక్రవారం 36వ రోజు అన్నదాన కార్యక్రమానికి బోడబండ్ల పంచాయతీ డేగలబండ గ్రామానికి చెందిన బాలయ్య కుమారులు సోమశేఖర్ నాయుడు, లక్ష్మీపతి నాయుడు అన్నదానం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్యాబ్‌లు సకాలంలో అందించాలి: డీఈవో


మాట్లాడుతున్న ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు (సెంట్రల్), జనవరి 12: ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థికి ట్యాబ్‌లను సకాలంలో అందించాలని డీఈవో విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక బాలాజీ కాలనీలోని మున్సిపల్ పాఠశాలలోని ఎంఈవోలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లకు సమావేశం నిర్వహించారు. డీఈవో, ఏపీసీ మాట్లాడుతూ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న నాడు-నేడు పనులు సకాలంలో పూర్తి చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సీఎంవో జయప్రకాష్, ఎంఈవోలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

చెరువుల్లోకి చేప పిల్లలు

బంగారుపాళ్యం, జనవరి 12: ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మత్స్యసమృద్ధి యోజన పథకం కింద మండలంలోని గుంతూరులోని వీరప్పనాయనిచెరువులో 40వేల చేపపిల్లలను శుక్రవారం రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ ఎంటీ కుమార్‌రాజా వదిలారు. అలాగే లింగసముద్రం, కామాక్షమ్మచెరువు, గౌనిచెరువు, ఎగువచెరువులో కూడా చేప పిల్లలను వదిలారు. గంగపుత్రుల సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, ఉమాపతి, ఎఫ్‌డీవో పయణి, ఫీల్డ్ అసిస్టెంట్ గౌరి, మత్స్యకారులు చంద్రశేఖర్, కేశవులు, రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

రాజుల సంఘం ఆధ్వర్యంలో
క్రికెట్ పోటీలు

పాలసముద్రం, జనవరి 12: మండలంలోని బలిజకండ్రిగలో రాజుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి పండుగలో భాగంగా క్రికెట్ పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని క్షత్రియులతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రంలో ఉన్న క్షత్రియ కులస్తులు ఇక్కడ ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా క్రీడాపోటీలు నిర్వహిస్తారు. 14వ తేదీ సాయంత్రం క్రీడా పోటీల ముగింపు సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను సంఘం తరపున ప్రదానం చేస్తారు.

15, 16 మకరజ్యోతి దర్శనం

చిత్తూరు కల్చరల్, జనవరి 12: నగరంలోని ప్రశాంత్‌నగర్‌లో వెలసిన శాస్త్రగిరి అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 15, 16 తేదీల్లో మకరసంక్రాంతి సందర్భంగా మకరజ్యోతి దర్శనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.